సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 31 । మార్చి । 2024



ఇంకుబేషన్ అత్యవసరం

ఆవిష్కరణల ప్రాముఖ్యతకు ఈవెంట్లు తప్పనిసరని ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. 8లో▸



డంపు యార్డులో మంటలు

షాద్‌నగర్ మున్సిపల్ పరిధి సోలీపూర్ శివారులోని చెత్త డంపు యార్డులో శనివారం ఉదయం మంటలు చెలరేగాయి. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
ఆదివారం	సోమవారం
సాయంత్రం	ఉదయం
6:34	4:48

న్యూస్‌రీల్

రెండు కిలోల గంజాయి పట్టివేత!

ఇబ్రహీంపట్నం రూరల్: రెండు కిలోల గంజాయి పట్టుబడిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది.వివరాలివీ.. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్ వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. వారిని ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు ఆదివారం మీడియాకు వెల్లడించనున్నారు.

ముష్టిపల్లి చౌరస్తాలో..



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొందుర్గు: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. స్కూటీలో 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా వాసి పంకజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. బీహార్ రాష్ట్రం, ముజపర్ జిల్లా, పారు మండలం కమల్‌పూరాకు చెందిన గణేశ్ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. అనంతరం పంకజ్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. ప్రధాన నిందితుడు గణేశ్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు.

ప్రజల విశ్వాసం కోల్పోయారు

- సీఎం రేవంత్ చేసిందేమీ లేదు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

తాండూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. తాండూరు పట్టణ శివారులోని జీపీఆర్ గార్డెన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, సీనియర్ నేత పర్యాద కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉండాల్సిన కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరడం దారుణమన్నారు. అలాంటి వారికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. కేసీఆర్ హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దారని తెలిపారు. బీసీ నేత కాసానికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇచ్చారని, ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో బీసీ కులాల ఐక్యత కోసం అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కాసాని సొంతమన్నారు. అలాంటి నేతను ప్రజలు అక్కున చేర్చుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇక్కడి ప్రజలు బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు ఎంపీలను గెలిపించారని, ఈ సారి కూడా అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్ రెడ్డికి ప్రజల్లో విశ్వాసం లేదని, రంజిత్‌రెడ్డి రన్నింగ్ రెడ్డిలా మారారని అన్నారు. ఆ రెండు పార్టీలకు ఓటమి తప్పదని తెలిపారు.



ఆమనగల్లు: పరీక్ష కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు

కాలేజీలో కలుద్దాం

పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 18న ఎగ్జామ్స్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. చివరి రోజు పరీక్ష రాసిన విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటికి వచ్చారు. ఒకరినొకరు కలిసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సరదాగా సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



కేశంపేట: కొత్తపేటలో విక్టరీ సింబల్ చూపుతున్న విద్యార్థులు



మొండిగౌరెల్లిలో సాగవుతున్న పుదీనా పంట

ఘుమఘుమల పుదీనా

సండే స్పెషల్



ఆ పల్లెలోకి అడుగుపెడితే చాలు పుదీనా ఘుమఘుమలు వెదజల్లుతాయి.. ఆ గ్రామంలో ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు మెజార్టీ రైతులు పుదీనాను నమ్ముకుని ముందుకు 'సాగు'తున్నారు. 25 ఏళ్లుగా పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అక్కడి పంటకు మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఉంది. అటు రైతులు ఆదాయం గడిస్తుండగా ఇటు కూలీలకు సైతం ఉపాధి మార్గంగా మారింది. యాచారం మండలం మొండిగౌరెల్లి పుదీనా సాగుకు పెట్టింది పేరు..

ఊరంతా ఈ పంటే..

- మొండిగౌరెల్లి .. వాసనలు వెదజల్లి
- పుదీనా గౌరెల్లిగా ప్రసిద్ధి
- అత్యధికంగా సాగు
- ఇక్కడి పంటకు మార్కెట్లో భలే డిమాండ్
- మంచి ఆదాయం గడిస్తున్న రైతులు



యాచారం: బోరుబావుల్లో కొద్దిపాటి నీళ్లున్న ప్రతి రైతు గ్రామంలో పుదీనా పంటను సాగు చేస్తారు. పెద్దగా నీటి వనరులు లేకపోయినా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆరుతడి.. స్వల్ప కాలంలో చేతికొచ్చే పంట కావడం.. రోజూ విక్రయాలతో నిత్యం చేతిలో డబ్బులు కనిపిస్తుండడంతో రైతులు పుదీనా పంటపై మక్కువ చూపిస్తున్నారు. అధిక శాతం రైతులు పుదీనా సాగు చేస్తుండడంతో జిల్లాతో పాటు హైదరాబాద్, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ గ్రామం పుదీనా గౌరెల్లిగా పేరుపొందింది. గ్రామానికి పిల్లనిచ్చినా.. ఈ గ్రామం నుంచి పిల్లగాళ్లను చూసినా పుదీనా గౌరెల్లి అంటూ పిలవడం రివాజుగా మారింది.

పశువుల ఎరువుతో పంట

పుదీనా ఆరు తడి పంట కావడంతో 45 రోజుల్లోనే చేతికొస్తోంది. ఓ వైపు నుంచి కోత ప్రారంభిస్తే 45 రోజుల్లోపు మరోవైపు నుంచి కోతకు వస్తుంది. ఇక్కడి రైతులు పంటను పూర్తిగా పశువుల ఎరువుతోనే పండిస్తారు. అవసరమైతే తప్ప పురుగు మందులు వాడేది ఉండదు. కూలీల ద్వారా పంట కోయించి, కట్టలు కట్టిస్తారు. వాటిని నిత్యం వేకువజామున రెండు గంటలకే వాహనాల్లో నగరంలోని మాదన్నపేట, సరూర్‌నగర్ తదితర మార్కెట్లకు తరలిస్తారు. శుభకార్యాలు, పండుగల సీజన్‌లో ఇక్కడి పుదీనాకు భలే డిమాండ్ ఉంటుంది. గ్రామంలో పుదీనా సాగుతో లాభాలు ఆర్జించి ఎంతోమంది రైతులు ఆర్థిక ప్రగతి సాధించారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు. వచ్చిన సొమ్ము నుంచి ఇంకా పాడి పశువుల కొనుగోళ్లకు ఖర్చు చేస్తూ ప్రత్యామ్నాయంగా మంచి ఆదాయం పొందుతున్నారు.

ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహం

మొండిగౌరెల్లి గ్రామంలో పుదీనా రైతుల జీవనాధారంగా మారింది. అలాంటి వారికి ప్రభుత్వం నుంచి ఏ మాత్రం ప్రోత్సాహం దక్కడం లేదు. మార్కెట్లో మంచి ధరకు అమ్ముకోవడానికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదు. వడగళ్లు కురిసి పంట నష్టపోయిన సందర్భంలో ప్రకృతి విపత్తుల కింద గుర్తించడ లేదు. సర్కార్ ప్రోత్సహిస్తే మరింత మంది పంట పండించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

25 ఏళ్ల క్రితం బాలాపూర్ నుంచి..

మహానగరం సమీపంలో ఉన్న బాలాపూర్‌లో 25 ఏళ్ల క్రితం అక్కడి రైతులంతా ఆకుకూరలు సాగు చేసి జీవనోపాధి పొందేవారు. అక్కడ సాగు చేసే పుదీనా పంటను గ్రామానికి చెందిన పాలంగారి ఆగారెడ్డి తెచ్చి మొట్టమొదటగా తన వ్యవసాయ పొలంలో సాగు చేశాడు. పంట స్వల్పకాలంలో చేతికి రావడం.. నిత్యం మార్కెట్‌కు తరలించి విక్రయించడం.. మంచి లాభాలు గడించడం గమనించిన మిగతా రైతు లు ఆయన పొలంలో ఉన్న పుదీనా నారును తీసుకెళ్లి తమ వ్యవసాయ పొలాల్లో నాటుకున్నా రు. ప్రస్తుతం గ్రామంలో దాదాపు బోరుబావులున్న ప్రతి రైతు గుంట లేదా, రెండు గుంటలు, అర ఎకరా ఇలా పుదీనా సాగు చేస్తున్నారు.



ఇదే ఆధారం



20 ఏళ్లుగా పుదీనా సాగుపై ఆధారపడి జీవిస్తున్నాం. పురుగు మందులు వాడకుండా పశువుల ఎరువును వినియోగిస్తాం. కూలీలతో కలుపు తీయిస్తాం. ప్రస్తుతం ఆదాయం బాగానే ఉంది. ప్రభుత్వం గురితంపు కార్డులిస్తే మార్కెట్లో మంచి ధరకు అమ్ముకునే వీలుంటుంది.

– కుంచారపు సుమిత్ర, మహిళా రైతు



అలా మొదలైంది..



బాలాపూర్‌లోని మా బంధువులు సాగు చేసే పుదీనా పంటను 25 ఏళ్ల క్రితం తెచ్చి అర గుంటలో నాటాను. 40 రోజులకే కోతకు వచ్చింది. మొదట్లో మాల్, యాచారం మార్కెట్లోకి తీసుకెళ్తే ఆసక్తితో కొనేవారు. తర్వాత చాలా మంది రైతులు నారు తీసుకెళ్లి తమ పొలాల్లో సాగు చేయడం ప్రారంభించారు.

– పొలంగారి ఆగిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

భువనగిరి గడ్డ.. 'పట్నం' బిడ్డ

- లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి పోటీ అవకాశం
- బీఆర్‌ఎస్ నుంచి బరిలోకి దిగిన క్యామ మల్లేశ్
- బడుగుల నేతగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు



క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల వేళ రాజకీయం రోజు రోజుకూ వేడెక్కుతోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు కదన రంగంలోకి దిగాయి. అభ్యర్థుల వేట పూర్తయ్యింది. కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయగా షెడ్యూల్ కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు జంపింగ్‌లతో వలసలు ప్రారంభమయ్యాయి. జిల్లా పరిధిలో మూడు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి.

క్యామకు పోటీ చేసే చాన్స్..

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలోకి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు వస్తాయి. 18 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇక్కడి నుంచి ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ బరిలో నిలిచారు. బడుగు బలహీన వర్గాల నాయకుడిగా రాష్ట్ర స్థాయిలో పేరున్న క్యామ మల్లేశ్‌కు బీఆర్‌ఎస్ అవకాశం కల్పించింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు భువనగిరి లోక్‌సభ స్థానానికి ఎవరూ పోటీ చేసింది లేదు. ఏ రాజకీయ పార్టీ కూడా అవకాశం కల్పించలేదు. గతంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నల్లగొండ పరిధిలో ఉండేది. 2014 ఎన్నికల్లో నల్లగొండ నుంచి భువనగిరిగా విడిపోయింది. తుంగతుర్తి, ఆలేరు, జనగాం, భువనగిరి, ఇబ్రహీంపట్నం, మునుగోడు నియోజకవర్గాలు దీని పరిధిలో చేరాయి. ధర్మభిక్షం, సురవరం సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇలా అందరూ నల్లగొండకు చెందిన వారే ఎంపీలుగా గెలుపొందుతూ వచ్చారు. నల్లగొండ ప్రాంతానికి చెందిన వారే అభ్యర్థులుగా అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్నారు. ఈసారి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన క్యామ మల్లేశ్‌కు అవకాశం వచ్చింది.

హామీ ఇచ్చి నిలబెట్టుకున్న కేసీఆర్

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్‌ఎస్ టికెట్‌ను క్యామ మల్లేశ్ ఆశించారు. కానీ సిట్టింగ్‌కే అవకాశం కల్పించడంతో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మరోసారి బరిలో నిలిచారు. దీంతో క్యామ మల్లేశ్ అలకబూనగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కలిసి గులాబీ బాస్ కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, లేదంటే ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు.

ఇదే మొదటిసారి

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి పోటీ చేసేందుకు ఇబ్రహీంపట్నం వారికి అవకాశం దక్కలేదు. ఏ పార్టీ అభ్యర్థులు కూడా పోటీ చేయలేదు. మొదటిసారి బీఆర్‌ఎస్ పార్టీ అవకాశం ఇచ్చింది. గుర్తించి టికెట్ కేటాయించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. ప్రజా ఆశీర్వాదంతో కచ్చితంగా గెలిచి తీరుతానన్న నమ్మకం ఉంది.

– క్యామ మల్లేశ్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి

మంచి సంకల్పానికి దేవుడి ఆశీస్సులు



మాట్లాడుతున్న హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- 'పట్నం' పెద్ద చెరువు కట్టపై 108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహ నిర్మాణానికి అంకురార్పణ

ఇబ్రహీంపట్నం: మంచి సంకల్పానికి.. భగవంతుడి సంపూర్ణ ఆశీస్సులు ఉంటాయని శాసనసభా వ్యవహారాలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కొనకట్ట ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు వద్ద శ్రీహరివర అఖండ క్షేత్ర సమితి నిర్మించతలపెట్టిన 108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహ నిర్మాణానికి శనివారం విద్యారణ్య భారతి స్వామీజీ, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తాను జాతీయ కాంగ్రెస్ కార్యదర్శిగా ఉన్నప్పుడు పలుమార్లు విద్యారణ్య భారతి స్వామీజీని కలిశానని, కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో స్వామీజీ ఆశీస్సులున్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అచరణలో పెడుతూ ముందుకెళ్తోందన్నారు.

దైవ, స్వామి భక్తితోనే..

హంపీ పిఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ మాట్లాడుతూ.. త్రేతాయుగంలో గొప్పగా చదువుకున్న విజ్ఞాన వంతుడైన హనుమంతుడు దైవ, స్వామి భక్తితోనే చిరంజీవిగా నిలిచాడన్నారు. నిత్యం ప్రశాంతంగా హనుమాన్ చాలీసా పఠిస్తే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ధైర్యం, సహనం, యుక్తి, శక్తి, వీరత్వం పేరుగుతాయని వెల్లడించారు. నాటి దేవాలయాలు మానవ సంపూర్ణ వికాసానికి ఎంతో ఉపయోగంగా ఉండేవని, ప్రస్తుత విద్యావ్యవస్థలో మన ధర్మాన్ని కాపాడుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో శ్రీహరివర అఖండ క్షేత్ర సమితి వ్యవస్థాపకుడు సదా వెంకట్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కప్పరి లక్ష్మయ్య, కౌన్సిలర్ ఈర్లపల్లి సునీత, ధర్మ జాగరణ ట్రస్టు సభ్యులు అమరలింగన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

12 స్థానాల్లో విజయం మాదే..

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 10 నుంచి 12 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ వాగ్దానాలను నెరవేర్చామని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ఎదురవుతున్న ఆర్థికపరమైన సమస్యలను అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రజల కోసం పనిచేయని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని జనాలే గద్దె దించారని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ఓట్లను దండుకోవాలని చూస్తోందని తెలిపారు. పదేళ్ల పాలనలో 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్యాస్, పెట్రో, పప్పు, ఉప్పు, కూరగాయల ధరలు బీజేపీ పాలనలో నింగినంటాయన్నారు.

ఏసీబీ వలలో ఎస్‌ఐ

- రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన పోలీసు అధికారి
- మీర్‌పేట్ స్టేషన్‌లో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన వైనం

మీర్‌పేట: నోటరీ ప్లాటు విక్రయ సెటిల్‌మెంట్ వ్యవహారంలో రూ.10 వేలు లంచం తీసుకుంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ సైదులు అడ్డంగా దొరికిపోయాడు. మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాదర్‌గుల్‌కు చెందిన షేక్ నజీముద్దీన్ గత డిసెంబర్‌లో సర్వే నంబర్ 197లోని తన 200 గజాల నోటరీ ప్లాటును గుర్రంగూడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదాని సుభాష్‌కు రూ.4.80 లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. దీంతో సుభాష్ రూ.2.10 లక్షలు బయానా చెల్లించి ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను తీసుకుని అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఈ ప్లాటు కొంత కాలంగా కోర్టు వివాదంలో ఉండడం, తాజాగా కోర్టు కేసు అనుకూలంగా వచ్చే అవకాశం ఉండడంతో నజీముద్దీన్ తన ప్లాటును తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి తేగా సుభాష్ అంగీకరించలేదు. దీంతో నజీముద్దీన్ ఈ నెల 23న మీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బొడ్డుపల్లి సైదులుకు ఫిర్యాదు చేశాడు. సివిల్ వివాదంలో తలదూర్చిన పోలీసు అధికారి సుభాష్‌ను స్టేషన్‌కు పిలిపించి ప్లాటు పత్రాలు వెనక్కి ఇవ్వకపోతే, అవి పోయినట్లు దొంగతనం కేసు పెడతానని బెదిరించాడు. దీంతో భయపడిన సుభాష్ ప్లాట్ కాగితాలు నజీముద్దీన్‌కు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసి ఎస్‌ఐ సుభాష్‌కు రూ.1.40 లక్షలు ఇప్పించాడు. ఇందులో తనకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, రూ.5వేలు ఇస్తానని ఒప్పుకొన్నాడు. ఆ తర్వాత ఓసారి మధ్యవర్తి ముత్యంరెడ్డితో కలిసి స్టేషన్‌కు వచ్చాడు. రూ.10 వేలు ఇస్తామని చెప్పడంతో ఎస్‌ఐ ఓకే చెప్పాడు. ఈ వ్యవహారాన్నంతా బాధితుడు ముందుగానే సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి ఏసీబీ అధికారులకు పంపాడు. శనివారం పీఎస్‌కు వచ్చిన సుభాష్ నుంచి ఎస్‌ఐ రూ.10 వేలు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్‌ఐ సైదులును మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చడంతో పాటు అతని ఇంట్లోని ఫైళ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. 2021లో సరూర్‌నగర్ పీఎస్‌లో విధులు నిర్వర్తించిన సమయంలోనూ ఇలాంటి కేసులోనే ఎస్‌ఐ సైదులు సస్పెండ్ అయ్యాడని స్పష్టం చేశారు. లంచం కోసం ఇబ్బంది పెడితే 1064 ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.



ఎస్‌ఐ సైదులు

గడ్డి వాములు దగ్ధం



తగలబడుతున్న గడ్డి వాములు

తలకొండపల్లి: గడ్డి వాములు దగ్ధమైన సంఘటన మండల పరిధి చుక్కాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మరి పుల్లయ్య, మైపాల్ నాయక్‌లకు చెందిన రెండు గడ్డి వాములు కాలిపోయాయి. ఈ ఘటనపై బాధిత రైతులు మాట్లాడుతూ.. ఎవరో కావాలనే తమ గడ్డి వాములకు నిప్పుపెట్టారని ఆరోపిస్తూ.. ఆవేదన వ్యక్తం చేశారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విద్యాభివృద్ధిలో ఇంకుబేషన్ అత్యవసరం

రాష్ట్ర ఇన్‌ఫర్‌మేషన్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్

మొయినాబాద్‌రూరల్: ఆవిష్కరణల ప్రాముఖ్యతను తెలపడానికి ఈవెంట్లు తప్పనిసరని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. శనివారం మండల పరిధి అమ్డాపూర్ జేబీ విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన జేబీజీఐఈ ఇన్నోవేషన్, ఇంకుబేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. టీ–హబ్ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇలాంటి సెంటర్లను ప్రారంభించడం విద్యాసంస్థలకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జే.వి.కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువస్తూ, పోటీతత్వానికి తట్టుకునే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్‌ను కళాశాల కార్యదర్శి జే.వి.కృష్ణారావు సన్మానించారు. కార్యక్రమంలో టీ–హబ్ చీఫ్ డెలివరి అధికారి అవిష్ ఆంథోని, కోలకలూరి ఇనోచ్, ఆయా కళాశాలల ప్రిన్సిపాలలు, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయేష్‌రంజన్

‘టంగటూరు’ కేసులో మరో నిందితుని అరెస్టు

మణికొండ: శంకర్‌పల్లి మండలం టంగటూరు గ్రామంలో ముగ్గురు కుమారులను హత్య చేసి తను ఆత్మహత్య చేసుకున్న నీరటి రవి కేసులో మరో నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను శనివారం నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ విలేకరులకు తెలిపారు. మార్చి 3వ తేదీన టంగటూరు గ్రామానికి చెందిన నీరటి రవి ఇంట్లో తన ముగ్గురు కుమారులను చంపి, అతను కొత్తగా నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ వద్ద ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. అతని భార్య శ్రీలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన మోకిల పోలీసులు ఇప్పటికే ఈ కేసులో హోంగార్డు నాగరాజు, విలేకరులు ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.ప్రవీణ్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసులో ఏ–1గా ఉన్న తిరుపతిరావును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా మనీ సర్క్యులేషన్ స్కీములో భాగంగా రవి మండలవ్యాప్తంగా వందలాది మందిని సభ్యులుగా చేర్పించాడు. అతను సభ్యుల నుంచి భారీ మొత్తం వసూలు చేయగా సంస్థ నిర్వాహకుడైన తిరుపతి రావుకు మాత్రం రూ.13 లక్షలు మాత్రమే పంపాడని, ఆధారాలతో విచారణలో తిరుపతి రావు ఈ విషయం వెల్లడించాడని ఏసీపీ తెలిపారు. ఈ కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు టీములు వెతుకుతున్నాయని ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో మోకిల సీఐ హరిబాబు పాల్గొన్నారు.

చెరువు కబ్జాకోరులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార్మిక సంఘం నేతలు

మంచాల: చెరువుల కబ్జాకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల పరిధి తిప్పాయి గూడ గ్రామంలో పెద్దరోని కుంట చెరువును పరిశీలించి, యాదాద్రి నారాయణపురం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ వ్యాపారులు, కుంట చుట్టూ మట్టి నింపుతూ రావడమే గాకుండా.. ఎఫ్‌టీఎల్ పరిధి లేకుండా చేశారని ఆరోపించారు. ఈ కుంట చెరువు నారాయణపురం రెవెన్యూ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. చెరువు కబ్జాకు గురవడం వలన మత్స్యకారులతో పాటు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కబ్జాదారుల నుంచి చెరువును విడిపించాలని కోరారు. ఇందులో మత్స్యకారులు కృష్ణ, గోపాల్ తదితరులు ఉన్నారు.

డంపు యార్డులో చెలరేగిన మంటలు

దుర్వాసనతో కూడిన పొగతో స్థానికుల ఉక్కిరిబిక్కిరి



దగ్ధమవుతున్న చెత్త

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధి సోలీపూర్ గ్రామ శివారులోని చెత్త డంపు యార్డులో శనివారం ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో గ్రామంలో దట్టమైన పొగ వ్యాపించింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది.. వెంటనే నీటి ట్యాంకర్ల సహాయంతో మంటలను ఆర్పేశారు. కాగా.. డంపు యార్డును వెంటనే ఇక్కడి నుంచి తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తరుచూ డంప్ యార్డులో మంటలు చెలరేగుతూ.. దుర్వాసనతో కూడిన పొగ వ్యాపించి ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని వాపోయారు. రోగాలా బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. షాద్‌నగర్ శివారులో నూతనంగా నిర్మించ తలపెట్టిన నూతన డంప్ యార్డు పనులను వెంటనే పూర్తి చేసి, అక్కడికి తరలించాలని కోరారు.

‘కోడ్’ కూసినా ముసుగు పడలే..



ప్రధాన కూడలిలో ముసుగు లేకుండా ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహం

మొయినాబాద్: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో.. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగు వేస్తారు. కానీ ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ.. మొయినాబాద్ ప్రధాన కూడలిలోని మాజీ హోంమంత్రి, దివంగత నేత ఇంద్రారెడ్డి విగ్రహానికి తెల్లని వస్త్రం కప్పకుండా వదిలేశారు. కోడ్ కూసి పక్షం రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయకుండా వదిలేయడంతో పలు విమర్శలకు తావిస్తోంది.

నెమలి మృత్యువాత



నెమలి కళేబరం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎండలు మంటలు పుట్టిస్తుండటంతో పశు పక్షాదులు అల్లాడిపోతున్నాయి. తాగునీరు లేకనో, వేడికి తట్టుకోలేకనో ఆ వన్య ప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. తాజాగా వేసవి తాపానికి తాళలేక జాతీయ పక్షి నెమలి మృత్యువాత పడింది. ఈ సంఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీపటేల్‌గూడ రెవెన్యూలో ఔటర్‌రింగ్‌రోడ్డుకు సమీపంలో శనివారం చోటు చేసుకుంది.

ఇంట్లోకి వచ్చి.. వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లి..

రాజేంద్రనగర్: ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని టార్గెట్‌గా చేసుకున్న ఓ మహిళా చైన్‌స్నాచర్.. రెండున్నర తులాల బంగారు గొలుసు అపహరించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పర్‌పల్లి ప్రాంతానికి చెందిన నర్సమ్మ(70) శనివారం ఉదయం తన నివాసంలో ఉండగా.. అది గమనించిన గుర్తు తెలియని మహిళ నేరుగా నర్సమ్మ వద్దకు వచ్చి మెడలోని బంగారు గొలుసును అపహరించింది. కుటుంబీకులతో కలిసి బాధితురాలు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

PUBLIC NOTICE

Take notice on behalf of my client Sri Firdous Khan S/o Noor Khan, aged about 35 years, Occ: Private Employee, R/o. H.No.10-2-267/7, Fashion Apartment, Flat No.07, Block-A, 3rd Floor, Street No.5, West Marredpally, Secunderabad-500026, has intended to purchase all that piece and parcel of Open Plots bearing No. 109/F admeasuring 282 square yards under Sun Shine Shilpa Estates developed by M/s. Shilpa Estates & Resorts Pvt Ltd and M/s. Atchutanada Real Estate Pvt. Ltd an HMDA Approved Layout vide No. LP.No.03/LO/PLG/HMDA/2009 dated 25.1.2022 in Sy.No.85/P, 89/P & 90/P of Edulapally Village, Nandigama Mandal, Rangareddy District.

Therefore any person/persons having any claims or interest in the respect of the above described property or part thereof by way of sale exchange, mortgage, charge, gift maintenance, inheritance, possession, lease, tenancy sub tenancy, lien, licence, hypothecation, transfer of title or beneficial interest under any trust right of prescription or pre-emption or under any agreement or other deposition or under any decree, order or awarder, or any claims in any manner or an interest in the said property or any part thereof by way of sale, gift, charge, lien, trust, possession, easement, attachment or otherwise claiming whosoever are hereby required to make the same known in writing together with supporting documents to the undersigned at their office: M/s LexLore Law Firm, Advocates & consultants # Flat No. 101 in Plot No. 100, Above Punjab National Bank, Vasudeva Reddy Nagar, Attapur, Pillar No.143, Hyderabad, Telangana, within a period of (14) days from the date of publication of this notice, failing which, the above said sale will be completed without any reference to such claim and the same, if any shall be considered waved and/or abandoned.

Sd/- MD. MUSTAQ AHMED SIDDIQUI
ADVOCATE (TS/2478/2005)
Cell No. 7995774603

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE
AT:SHADNAGAR
OS.No. 131 of 2015

K. Veeramma and Others ...Plaintiffs
And
P.Anjaneyulu and Others ...Defendants

1.M.Lavanya W/o Kantha Reddy, Age: 51yrs, OCC: House hold R/o H.No 6-48, Ward 19, Circle.3, N.M.Guda Village, Rajendranagar Mandal, R.R. Dist. ...Proposed defendant No.5

2.M. YadiReddy S/o Late Balreddy, Age: 65yrs, OCC: Agriculture R/o H.No. 23-85/1, Madhuranagar Colony, Shamshabad Vill & Mandal, R.R Dist. ...Proposed defendant No.6

Notice

Whereas the Plaintiffs filed a Suit for partition over the suit schedule property against the defendants. The notices of the defendant No.5 and 6 cannot served in ordinary way of service due to at their residences were returned unserved, Hence this proclamation U/o 5.rule 20 of CPC is hereby issued against the defendant No 5 and 6 as they should appear personally or through their advocate on 12.04.2024 at 10.30 AM take notice that in default their appearance, failing which the matter will be heard and determined in absence of defendant No 5 and 6

(By Order of the Court)

Sd/- V.RAMCHANDRAIAH, B.Sc. LLB
Advocate
Shadnagar. Cell:9866497949



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.